రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి

విలేకరులతో మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి

గజ్వేల్, జూన్ 23: రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తున్నదని, సీఎం రేవంత్ రెడ్డి రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రైతు రుణమాఫీ చేసేందుకు సిద్ధమవుతున్నారని డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి అన్నారు. ఆదివారం గజ్వేల్‌లోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ చేసేందుకు చర్యలు చేపట్టారని, త్వరలోనే రైతులకు శుభవార్త వస్తుందన్నారు. కొండపోచమ్మ, మల్లన్నసాగర్ భూనిర్వాసితులకు రుణమాఫీ వర్తించే విధంగా ప్రభుత్వానికి సమస్యను విన్నవిస్తామన్నారు. క్యాసారంలో ఓ రైతు వేసిన విత్తనాలు మొలకెత్తలేదని తన దృష్టికి తీసుకురాగానే వెంటనే వ్యవసాయాధికారులను పూర్తి సమాచారం తెలుసుకోవాలని సూచించానన్నారు. సమావేశంలో మాజీ మున్సిపల్ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, పార్టీ పట్టణ అధ్యక్షుడు రాజు, నాయకులు సర్దార్ ఖాన్, బోస్, సమీర్, రాజు పాల్గొన్నారు.

మల్లన్న క్షేత్రంలో భక్తుల సందడి

రాజగోపురం ముందు భక్తుల సందడి

చేర్యాల, జూన్ 23 : కొమురవెల్లి మల్లికార్జునస్వామి క్షేత్రంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. శనివారం సాయంత్రం కొమురవెల్లికి చేరుకున్న భక్తులు ప్రైవేట్, ఆలయ నిర్వహణలో ఉన్న దాతల గదులను అద్దెకు తీసుకుని రాత్రి బసచేశారు. ఆదివారం వేకువజామునే నిద్రలేచి కోనేటిలో పవిత్ర స్నానాలు ఆచరించారు, స్వామి వారిని దర్శించుకోవడంతో పాటు అభిషేకాలు, పట్నాలు, అర్చన, ప్రత్యేక పూజలు, ఒడి బియ్యం, కేశఖండన, గంగరేగు చెట్టు వద్ద ముడుపులు తదితర మొక్కులు చెల్లించుకున్నారు. మహిళలు భక్తిశ్రద్ధలతో బోనాలు తయారు చేసి కొండపైన ఉన్న ఎల్లమ్మతల్లికి సమర్పించారు. మరికొందరు రాతి గీరల వద్ద ప్రదక్షిణలు, కోడెల స్తంభం వద్ద కోడెలు కట్టి పూజలు, గంగరేగుచెట్టు వద్ద ముడుపులు కట్టి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఈవో బాలాజీ, ఏఈవోలు గంగా శ్రీనివాస్, బుద్ధి శ్రీనివాస్, ఆలయ ప్రధానార్చకుడు మహాదేవుని మల్లికార్జున్ పాల్గొన్నారు.

బహిరంగ వేలాన్ని ఉపసంహరించుకోవాలి

సిద్దిపేట, జూన్ 23: సింగరేణి బొగ్గగనుల బహిరంగ వేలాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే ఉపసంహరించుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి గోపాలస్వామి డిమాండ్ చేశారు. కేంద్ర గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి సింగరేణి గనులకు వేలంపాట నిర్వహిస్తామని ప్రకటించడంపై ఆదివారం సిద్దిపేటలో కొత్త బస్టాండ్ వద్ద సీపీఎం దాని అనుబంధ సంఘాల నాయకులు ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేలంపాట ద్వారా సింగరేణిని ప్రైవేటీకరణ చేస్తామని కేంద్రమంత్రి ప్రకటించినప్పటికీ కాంగ్రెస్ నాయకులు ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు.ఇప్పటికైనా సింగరేణిని ప్రైవేటీకరణ చేయాలనే నిర్ణయాన్ని మానుకోవాలని, లేని పక్షంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు రవికుమార్, పద్మ, ప్రశాంత్ పాల్గొన్నారు.

అంబేద్కర్ అభయ హస్తం పథకాన్ని అమలు చేయాలి

అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రదర్శన చేస్తున్న డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్ తదితరులు

గజ్వేల్, జూన్ 23: అంబేద్కర్ అభయ హస్తం పథకాన్ని అమలు చేసి ఎన్నికల హామీని నిలబెట్టుకోవాలని డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ డిమాండ్ చేశారు. ఆదివారం గజ్వేల్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రదర్శన నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. దళితుల సమగ్ర అభివృద్ధి, రక్షణపై అసెంబ్లీలో చర్చించాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్ అభయహస్తం పథకాన్ని రూ.12 లక్షలకు పెంచి అమలు చేస్తామని చెప్పిన హామీ నెరవేర్చాలన్నారు.కార్యక్రమంలో డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎగొండస్వామి, స్వామి, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉరివేసుకొని యువతి ఆత్మహత్య

వర్గల్, జూన్ 23: ప్రేమించి మోసం చేశాడని యువతి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని దండుపల్లిలో చోటుచేసుకుంది. బేగంపేట ఎస్సై భువనేశ్వర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన కాస హరిత (17) గజ్వేల్‌లోని ప్రభుత్వ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. గజ్వేల్ మండలం బంగ్లావెంకటాపూర్ గ్రామానికి చెందిన స్వామితో పరిచయం ప్రేమగా మారింది .ఇదే విషయమై హరిత తనను పెండ్లిచేసుకోవాలని స్వామితో అనడంతో అతడు నిరాకరించాడు. ఆదివారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఆమె సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ప్రేమవ్యవహారమే హరిత ఆత్మహత్యకు కారణమని, స్వామితో పాటు అతడికి సహకరించిన బంగ్లావెంకటాపూర్ గ్రామానికి చెందిన కాంటమైన శ్రీకాంత్, బొర్రెగూడెం గ్రామానికి చెందిన బొర్ర కావ్య, బొర్ర అఖిలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళి

గజ్వేల్ : నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

గజ్వేల్, జూన్ 23: బీజేపీ వ్యవస్థాపకుడు శ్యామ్‌ప్రసాద్‌ముఖర్జీ వర్ధంతిని పురస్కరించుకొని ఆదివారం గజ్వేల్‌లోని పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి పార్టీ శ్రేణులు నివాళులర్పించారు. నాయకులు రాంరెడ్డి, నాగులు, మధు, రాములు, మనోహర్ పాల్గొన్నారు.

కుకునూరుపల్లిలో..

కొండపాక(కుకునూరుపల్లి), జూన్ 23 : కుకునూరుపల్లి మండల కేంద్రంలో డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు, బూత్ అధ్యక్షులు పాల్గొన్నారు.

సిద్దిపేటలో..

సిద్దిపేట, జూన్ 23: బీజేపీ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా ఆపార్టీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కార్యాలయంలో బలిదాన్ దివాస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు నరేశ్, నాయకులు తోకల ఉమారాణి,ఉపేందర్‌రావు, శ్రీనివాస్, సాయి బాబా పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం

మద్దూరు(ధూళిమిట్ట), జూన్23: మద్దూరు మండలంలోని సలాఖపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1999-2001లో టెన్త్ పూర్తి చేసిన విద్యార్థులు ఆదివారం సమ్మేళనం ఏర్పాటు చేశారు. పూర్వ విద్యార్థులంతా కలుసుకొని చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తమకు విద్యా బుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. అనంతరం పూర్వ విద్యార్థులు ఆట, పాటలతో సందడి చేశారు.

సలాఖపూర్‌లో ..

గజ్వేల్‌లో..

గజ్వేల్, జూన్ 23: మండలంలోని అహ్మదీపూర్‌లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(2003-04బ్యాబ్) పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం జరుపుకొన్నారు. ఉపాధ్యాయులు శంకర్‌రెడ్డి, బి.పరమేశ, లక్ష్మారెడ్డి, విఘ్నేశ్వర్‌రెడ్డి, లచ్చిరెడ్డి, నరేశ్, పూర్వ విద్యార్థులు రమేశ్‌గౌడ్, అహ్మద్, ప్రభాకర్, సంతోష్‌రెడ్డి, నర్సింహులు, రాజ్‌కుమార్, పింకీ, అనుపమలు పాల్గొన్నారు.

గజ్వేల్‌లో..

దుబ్బాకలో పడకేసిన పారిశుధ్యం

- చెత్తాచెదారంతో నిండిన మురుగు కాల్వలు
- రోడ్ల పక్కన ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు
- ఇబ్బందులు పడుతున్న పట్టణ ప్రజలు

దుబ్బాక-చీకోడు రోడ్డు పక్కన చెత్తాచెదారం

దుబ్బాకలో మురుగు కాల్వ దుస్థితి

దుబ్బాక, జూన్ 23 : దుబ్బాక పట్టణంలో మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం ప్రజలకు శాపంగా మారింది. పారిశుధ్య పనులు చేపట్టకపోవడంతో సమస్యగా మారింది. దుబ్బాక పట్టణంలోని బస్టాండ్ నుంచి పాత సినిమా రోడ్డులో మురుగు కాల్వలు శుభ్రం చేయక చెత్తాచెదారం పేరుకుపోయింది. కాల్వలు ప్లాస్టిక్ బాటిల్స్, కవర్స్‌తో నిండి దుర్గంధం వెదజల్లుతోంది. ఈ విషయంపై మున్సిపల్ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని స్థానిక వ్యాపారులు, స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దుబ్బాకలో పలు వార్డుల్లో పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి ఇబ్బందికరంగా మారాయి. పిచ్చి మొక్కల మధ్య పాములు, ఇతర విషకీటకాలు సంచరిస్తున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వార్డుల్లో చెత్త సేకరణకు మున్సిపల్ వాహనాలు నిత్యం రాక ప్రజలకు ఇక్కట్లు తప్పడం లేదు. దుబ్బాక పట్టణంలో సేకరించిన చెత్తను మున్సిపల్ సిబ్బంది డంపింగ్‌యార్డుకు తరలించకుండా పట్టణ శివారులోని రోడ్ల పక్కన పారేస్తున్నట్లు విమర్శలు నెలకొన్నాయి. చెత్త కుప్పల వద్ద కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. దుబ్బాక పట్టణంలో దుబ్బాక-చీకోడు రోడ్డులో చెత్త కుప్పలు ఏర్పాటు చేయడంతో వాహనదారులు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమీపంలో ఎల్లమ్మ దేవాలయం, బీరప్ప దేవాలయాలు ఉండటంతో ఆలయాలకు వచ్చే భక్తులు ఇబ్బందులు పడుతున్నారు.

ఎండిపోయిన హరితహారం మొక్కలు

దుబ్బాక పట్టణంలో పలు వార్డుల్లో నాటిన హరితహారం మొక్కలు నేల పాలవుతున్నాయి. మొక్కల సంరక్షణ లేక చాలా చోట్ల ఎండిపోయాయి. మరికొన్ని చోట్ల మొక్కలకు నాటిన కంచెలు నేలకొరిగి విరిగిపోయాయి. మొక్కలు నాటి వాటి సంరక్షణ గాలికొదిలేశారు. దుబ్బాక-చీకోడు రోడ్డు, దుబ్బాక-దుంపలిపల్లిలో రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కలు ఎండిపోతున్నాయి. మొక్కలు నాటడంపై ఉన్న శ్రద్ధ వాటి సంరక్షణ లేక హరితహారం లక్ష్యం నీరుగారిపోతోంది.

స్పెషల్ డ్రైవ్ చేపట్టి సమస్య పరిష్కరిస్తాం

దుబ్బాక పట్టణంలో పారిశుధ్యం మెరుగు పర్చేందుకు త్వరలోనే స్పెషల్ డ్రైవ్ చేపడుతాం. ఒక్కొక్క వార్డులో మున్సిపల్ సిబ్బందితో ప్రత్యేకంగా పారిశుధ్య పనులు చేపట్టి సమస్య పరిష్కరిస్తాం. సేకరించిన చెత్తను డంపింగ్‌యార్డుకు తరలించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. హరితహారంలో నాటిన మొక్కల సంరక్షణ కోసం సిబ్బందిని ఏర్పాటు చేసి, వాటిని కాపాడుతాం. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులపై ముందస్తు చర్యలు తీసుకుంటాం.

- రమేశ్, దుబ్బాక మున్సిపల్ కమిషనర్

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

చేర్యాల, జూన్ 23 : మండలంలోని ముస్త్యాలకు చెందిన తెలంగాణ కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర సోషల్ మీడియా కో కన్వీనర్ మేరిండ్ల శ్రీనివాస్ ఇటీవల మృతి చెందాడు. ఆదివారం మృతుడి కుటుంబ సభ్యులను గౌడ ఎంప్లాయిస్ సర్వీస్ సొసైటీ సభ్యులు పరామర్శించడంతో పాటు రూ.16వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో అంబటి సిద్ధయ్యగౌడ్, అంబాల వెంకటేశంగౌడ్, బురుగు కనకయ్యగౌడ్, నరిగే బాలకిషన్‌గౌడ్, కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బండకింది అరుణ్‌గౌడ్ పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న గౌడ ఎంప్లాయిస్ సర్వీస్ సొసైటీ సభ్యులు

సిద్దిపేటలో పేరుకుపోతున్న చెత్త

సిద్దిపేట నుంచి కిష్టాసాగర్ వెళ్లే దారిలో పేరుకుపోయిన చెత్తాచెదారం

సిద్దిపేట, జూన్ 23: సిద్దిపేట శివారు ప్రాంతాల్లో చెత్త పేరుకుపోతోంది. ముఖ్యంగా సిద్దిపేట పట్టణం చుట్టూ రింగ్ రోడ్డు వెంట చెత్త భారీగా కనిపిస్తున్నది. పట్టణంలో నిత్యం చెత్తసేకరణ వాహనాలు ఇంటింటికీ వస్తున్నప్పటికీ చాలామంది వాహనాల సిబ్బందికి చెత్త ఇవ్వకుండా సిద్దిపేట పట్టణ శివారులో పడేస్తున్నారు. దీంతో పట్టణ శివారులోని ఇస్తామియా కాలేజీ చౌరస్తా, సిరిసిల్ల బైపాస్ చౌరస్తాతో పాటు పట్టణంలోని పలు ప్రధాన చౌరస్తాల వద్ద ఉన్న రోడ్ల పక్కల చెత్త పేరుకుపోతోంది. నిత్యం మున్సిపల్ వాహనాల ద్వారా తడిపొడి చెత్తను సేకరించడంతో పాటు అవగాహన కల్పిస్తున్నప్పటికీ చాలామంది చెత్తను రోడ్ల వెంబడి వేస్తున్నారు. దీంతో గాలి దుమారం వచ్చినప్పుడు చెత్త రోడ్లపైకి వచ్చి వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వివిధ శుభకార్యాలు జరిగినప్పుడు నిర్వాహకులు రోడ్డు పక్కన చెత్తను పారేసి వెళ్తున్నారు. దీంతో శివారు ప్రాంతాల్లో చెత్తపేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోంది. పట్టణ శివారులోని కొన్ని ఫంక్షన్‌హాళ్ల నిర్వాహకులు చెత్తను బైపాస్ రోడ్డు పక్కన వేస్తున్నారు.

రోడ్లపై చెత్త వేసేవారిని గుర్తించి కౌన్సెలింగ్ ఇస్తున్నాం

సిద్దిపేట పట్టణ శివారులోని ఆయా చౌరస్తాల వద్ద సీసీ కెమెరాల ఆధారంగా చెత్త వేసే వారిని గుర్తించి వారికి కౌన్సెలింగ్ ఇస్తున్నాం. చెత్త సేకరణకు ప్రత్యేకంగా వాహనాలు ఏర్పాటు చేశాం. పూర్తి స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. రోడ్లపై చెత్త వేయకుండా చర్యలు తీసుకుంటున్నాం.

- ప్రసన్నరాణి,మున్సిపల్ కమిషనర్ సిద్దిపేట

సివిల్స్‌శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

సిద్దిపేట టౌన్,జూన్ 23 : తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో టీజీబీసీ స్టడీ సర్కిల్ హైదరాబాద్ లక్ష్మీనగర్ 2025 సివిల్స్ పరీక్షకు ఉచితంగా 150 మందికి లాంగ్‌టర్మ్ శిక్షణ ఇవ్వనున్నామని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి సరోజ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో 100 మంది ప్రతిభావంతులైన అభ్యర్థులను జూలై 7న ఆన్‌లైన్ టెస్ట్ ద్వారా ఎంపిక చేస్తామన్నారు. మిగిలిన మరో 50 మంది శిక్షణ అభ్యర్థులను ఇంతకుముందు యూపీఎస్సీ వారు నిర్వహించిన సివిల్ సర్వీస్ ప్రిలిమ్స్‌లో ఉత్తీర్ణత సాధించిన వారిని తీసుకుంటామన్నారు. సివిల్ సర్వీసెస్ లాంగ్‌టర్మ్ శిక్షణ అభ్యర్థులు సంబంధిత పత్రాలతో జూలై 3లోగా నేరుగా లక్ష్మీనగర్‌కాలనీ హైదరాబాద్‌లో దరఖాస్తు సమర్పించాలని కోరారు. ప్రవేశం పొందిన అభ్యర్థులకు లాడ్జింగ్, భోజనం, రవాణా తదితర వాటి నిమిత్తం ప్రతి నెలా రూ.5వేలు, అదేవిధంగా మరో 5వేలు బుక్స్ ఫండ్ కోసం అందిస్తామన్నారు. అభ్యర్థులకు గ్రంథాలయ సదుపాయం కల్పిస్తామని చెప్పారు.అర్హులైన అభ్యర్థులు ఆన్‌లైన్ www.tgbcstud ycircle.gov.inలో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు 08457-224941, 9966673095 నంబర్లలో సంప్రదించాలని ఆమె సూచించారు.

గంజాయి విక్రేయిత అరెస్టు

సిద్దిపేట టౌన్, జూన్ 23 : నిషేధిత గంజాయిని విక్రయించడానికి వచ్చిన యువకుడిని పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు .సిద్దిపేట టూటౌన్ సీఐ ఉపేందర్ వివరాల ప్రకారం.. తోర్నాల గ్రామానికి చెందిన చరణ్‌కుమార్ సిద్దిపేట శివారు కేసీఆర్ నగర్‌లో గంజాయిని సేవిస్తూ..విక్రయించడానికి వచ్చాడనే సమాచారంతో అతడిని పట్టుకున్నామన్నారు. ఈ మేరకు అతని వద్ద నుంచి 310 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామన్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం

హుస్నాబాద్, జూన్ 23: హుస్నాబాద్ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1992-93టెన్త్ బ్యాచ్‌కు చెందిన రుద్రారం రమేశ్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. రమేశ్ స్వగ్రామం కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం బొమ్మకల్ గ్రామానికి వెళ్లిన మిత్రబృందం రూ.20వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. బొద్దుల శంకర్, పున్న అశోక్, వరయోగుల అనంతస్వామి, బొల్లంపల్లి రవీందర్, ఎగ్గోజు సుదర్శనాచారి పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధికి సంపూర్ణ సహకారం

హుస్నాబాద్‌టౌన్, జూన్ 23: హుస్నాబాద్ పట్టణాభివృద్ధికి సంపూర్ణమైన సహకారం అందిస్తామని స్ఫూర్తిస్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు పందిల్ల శంకర్ అన్నారు. స్ఫూర్తి స్వచ్ఛంద సంస్థ సమావేశం ఆదివారం కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హుస్నాబాద్ పట్టణాభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు బీసీసంక్షేమం, రవాణాశాఖల మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ రూపొందించడం అభినందనీయమన్నారు. ప్రజల సలహాలు, సూచనలు ఎప్పటికప్పుడు మంత్రి తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. స్ఫూర్తి సంస్థకు చెందిన అనగోని తిరుపతి, మల్కిరెడ్డి మోహన్‌రెడ్డి, గౌరిశెట్టి వీరేశం, నోముల చంద్రారెడ్డి, గాజర్ల మోహన్, పబ్బ సాంబమూర్తి పాల్గొన్నారు.

నేడు హుస్నాబాద్‌లో మెగా జాబ్ మేళా

హుస్నాబాద్, జూన్ 23: నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతీ యువకుల కోసం సోమవారం హుస్నాబాద్‌లో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ మేళా పట్టణంలోని తిరుమల గార్డెన్‌లో ఉదయం 10 గంటలకు ప్రారంభం కానుంది. నియోజకవర్గంలోని సుమారు 5వేల మంది యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా నిర్వహిస్తున్న ఈ జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. 60కంపెనీలకు చెందిన ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. జాబ్ మేళాకు సంబంధించిన ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. ఇప్పటికే సుమారు మూడు వేలకుపైగా రిజిస్ట్రేషన్లు చేసుకున్నారని, ఇందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నామని అధికారులు తెలిపారు.

జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోండి

హుస్నాబాద్‌టౌన్, జూన్ 23 : పట్టణంలోని తిరుమల గార్డెన్‌లో సోమవారం నిర్వహించే మెగా జాబ్‌మేళాకు నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్‌రజితావెంకన్న, కమిషనర్ టి. మల్లికార్జున్‌గౌడ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. యువజన సర్వీసులశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే మెగా జాబ్‌మేళకు ఈ ప్రాంతంలోని నిరుద్యోగులు హాజరై సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు

కాంగ్రెస్ హామీలు అమలు చేయాలి

జీడిపల్లి రాంరెడ్డి

తొగుట, జూన్ 23 : అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జీడిపల్లి రాంరెడ్డి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రుణమాఫీతో పాటు ఆరు గ్యారెంటీల్లో పేర్కొన్న 13 హామీలు అమలు చేస్తేనే రాజీనామా చేస్తానని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు పేర్కొన్నారని గుర్తుచేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో అమలుకు సాధ్యం కాని హామీలు ఇచ్చి అటకెక్కించారన్నారు. పింఛన్ పెంచుతామని చెప్పి ఉన్న పింఛన్‌లో కోత పెట్టారన్నారు. కల్యాణలక్ష్మితోపాటు తులం బంగారం ఇస్తామని చెప్పి ఇవ్వడం లేదన్నారు. రైతుబంధు స్థానంలో రైతు భరోసా ద్వారా ఎకరాకు రూ. 15000, కౌలు రైతులు, కూలీలకు రూ. 12 వేలు ఇస్తామని ఇంతవరకు ఇవ్వలేదన్నారు. నిరుద్యోగులకు రూ.2500 ఇస్తామన్న నిరుద్యోగ భృతి ఏమైందని ఆయన ప్రశ్నించారు. కేసీఆర్ హయాంలో మల్లన్నసాగర్ నిర్మించి ఈ ప్రాంతానికి గోదావరి నీళ్లు అందించి సస్యశ్యామలం చేస్తే నేడు ఎండబెడుతున్నారని పేర్కొన్నారు. వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్, రైతు బీమా ద్వారా పెట్టుబడి సహాయం అందించిన ఘనత గులాబీ అధినేత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు.

సంస్కృతీ సంప్రదాయాలను కాపాడాలి

కళాకారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకన్న

హుస్నాబాద్‌టౌన్, జూన్ 23: ప్రాచీన సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మున్సిపల్‌చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకన్న అన్నారు. హుస్నాబాద్ పట్టణంలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, సంకల్ప స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నియోజకవర్గస్థాయి పౌరాణిక, జానపద సాంస్కృతిక జాతర ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జనంనుంచి వచ్చిందే జానపదమని, తల్లి లాంటి మన సంస్కృతిని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. హుస్నాబాద్ ప్రాంతం కళలకు నిలయంగా ఉందని, కళలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కృషిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రదర్శనలతో ఆకట్టుకున్న పలువురు కళాకారులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు.కార్యక్రమంలో సంకల్పస్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు వలస సుభాశ్, ప్రోగాం కోఆర్డినేటర్ యాదగిరి గీతా శారద, ఠాగూర్ బాలాజీసింగ్, పరశురాములుగౌడ్, కళాకారులు పాల్గొన్నారు.

సేవాలాల్ సేన జిల్లా కన్వీనర్‌గా శ్రీనివాస్‌నాయక్

మద్దూరు(ధూళిమిట్ట), జూన్23: ధూళిమిట్ట మండలంలోని హనుమతండాకు చెందిన బాదావత్ శ్రీనివాస్‌ను సేవాలాల్ సేన జిల్లా కన్వీనర్‌గా నియమించినట్లు ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు భూక్యాసంజీవ్‌నాయక్ ప్రకటించారు. ఈ మేరకు ఆదివారం శ్రీనివాస్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సేవాలాల్ సేన విద్యార్థి విభాగం అధ్యక్షులు బానోత్ రాజు నాయక్, నాగావత్ రాజేశ్‌నాయక్, మూడావత్ రవి, భూక్యా అజయ్, బాదావత్ సురేశ్, భూక్యా శ్రీకాంత్ పాల్గొన్నారు.

బాదావత్ శ్రీనివాస్‌కు నియామక పత్రాన్ని అందజేస్తున్న సంజీవ్‌నాయక్

దరఖాస్తుల ఆహ్వానం

కొమురవెల్లి, జూన్ 23 : స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ(సాట్) ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్ పాఠశాలలో నాలుగో తరగతిలో ప్రవేశం కోసం దరఖాస్తులు చేసుకోవాలని మండల విద్యాధికారి ఎం.శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకునే వారు 2023-24 విద్యా సంవత్సరంలో మూడోతరగతి చదివి 1-09-2015 నుంచి 31-08-2016 మధ్య జన్మించిన వారై ఉండాలన్నారు. ఇందు కోసం అప్లికేషన్ ఫామ్‌తో పాటు ఒరిజనల్ స్టడీ సర్టిఫికేట్, ఆధార్‌కార్డు జిరాక్స్, కుల ధ్రువీకరణ పత్రాన్ని నేడు కొమురవెల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సబ్మిట్ చేయాలని సూచించారు. ఈనెల 25న సెలక్షన్లు ఉంటాయని ఆయన తెలిపారు.

బెజ్జంకిలో..

బెజ్జంకి, జూన్ 23: స్పోర్ట్స్ స్కూల్ నాలుగో తరగతిలో ప్రవేశం కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎంఈవో యాదవ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 1.9.2015 నుంచి 31.8.2016లోపు జన్మించి 2023-24 విద్యా సంవత్సరంలో మూడో తరగతి చదివి ఉండాలన్నారు. విద్యార్థులు ఒరిజనల్ బోనాఫైడ్, ఆధార్, కుల ధ్రువీకరణ పత్రాలతో కూడిన దరఖాస్తును ఈనెల 24 సాయంత్రంలోగా బాలుర ఉన్నత పాఠశాలలోని పీడీ మలతికి